క్లుప్తంగా

విద్యార్థులు చక్కగా చదవాలి


విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విద్యార్థులు వినియోగించుకుంటూ చక్కగా విద్యను అభ్యసించాలని ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. మండలంలోని ఇడమకల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాకనుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి చదివించాలని తెలిపారు. పాఠశాలల్లో కోట్ల రూపాయలు వెచ్చించి అన్ని రకల సౌకర్యాలను విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, ఎంఈఓ వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువు షాపుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల షాపులను వ్యవసాయశాఖ అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరమణల ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా శ్రీక్రిష్ణ ట్రేడర్స్, మణికంఠ ట్రేడర్స్, చీతిరాల నాగేశ్వరరావు షాపుల్లో రికార్డులు పరిశీలించారు. ఎరువులు విత్తనాల స్టాకు, బిల్లు పుస్తకాలు, రసీదులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేని కారణంగా అమ్మకాలను నిలిపేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం వివరాలు తెలియజేసి అమ్మకాలు నిర్వహించాలని సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు.

పిచ్చయ్య యాదవ్‌ను వరించిన యోగా అవార్డు


పిచ్చయ్య యాదవ్

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంట పల్లె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్‌కు అంతర్జాతీయ యోగా అవార్డు వరించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వల్లూరి ఫౌండేషన్ పిచ్చయ్య యాదవ్‌కు అవార్డును అందజేసింది. పాఠశాలలోని విద్యార్థులకు యోగాసనాల గురించి వివరిస్తూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించేవారు. విద్యార్థుల మానసిక ఒత్తిళ్లు తగ్గించేందుకు యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని పిచ్చయ్య విద్యార్థులకు తెలియజేస్తుండేవాడు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో యోగా ప్రాముఖ్యతను ప్రస్తావించి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించుకునేలా చేశాడన్నారు. అవార్డును ప్రధానం చేసిన వల్లూరి ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరాజుకు పిచ్చయ్య యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిచ్చయ్య యాదవ్‌ను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రశంసించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- డీఎస్పీ బాలసుందరరావు



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు

మార్కాపురం: నేటి యువతరం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు సూచించారు. శుక్రవారం వరల్డ్ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా జార్జి కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత బాగా చదువుకుని మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని, డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు బానిసై ప్రజలు జీవితాలను కోల్పోతున్నారని, యువత బాగా చదువుకొని మంచి ఉద్యోగం సంపాదించుకుని కుటుంబంతో హాయిగా ఉండాలని కోరారు. డ్రగ్స్ అమ్మినా, వాడినా కేసులు నమోదు చేస్తామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని హితవుపలికారు. గంజాయి, హెరాయిన్, బ్రౌన్ సుగర్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రెహమాన్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్, జార్జి కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొమరోలు : యోగా చేస్తున్న విద్యార్థులు


జార్జి కాలేజీలో యోగా చేస్తున్న మాజీ మంత్రి సురేష్


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మార్కాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మార్కాపురం నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాల, ఎస్ఎస్ లా కాలేజ్, జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల, వాసవీ విద్యా నికేతన్, సాయిబాలాజీ హైస్కూల్‌తో పాటు, ఇండోర్ స్టేడియంలతో పాటు పలు పాఠశాలల్లో యోగాసనాలు వేయించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా శిక్షకులు పి.రామకృష్ణ, రంగయ్య, నాదెళ్ల చంద్రమౌళి మాట్లాడుతూ.. మానసిక బలానికి, ఆరోగ్య రక్షణకు యోగా ఎంతో అవసరమన్నారు. యోగా సాధనతో శాంతి, సహనం, ఓర్పు అలవడుతాయని చెప్పారు. చిన్ననాటి నుంచే యోగాపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. వాసవీ విద్యా నికేతన్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వాసవీక్లబ్ ప్రెసిడెంట్ జి రామకృష్ణా రావు, కోశాధికారి హరిబాబు, రీజనల్ సెక్రటరీ సూరె కేశవ తదితరులు పాల్గొన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, జింకా రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: యోగా డే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తోట చందన ఆధ్వర్యంలో సిబ్బంది యోగా సాధన చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కాపురంలోని జార్జి విద్యా సంస్థల్లో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విద్యార్థులతో కలిసి యోగా సాధన చేశారు.

కొనకనమిట్ల: రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పేర్కొన్నారు. విద్యార్థులకు యోగాతో కలిగే ప్రయోజనాలను పాఠశాల పీడీ బాలగురవయ్య వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: విద్యార్థులు యోగాపై ఆసక్తి చూపాలని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని గంజి భద్రయ్య మెమోరియల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యోగ ఆసనాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలోని కాశినాయన ఆలయం ఆవరణలో బీజేపీ నాయకులు యోగ ఆసనాలు నిర్వహించారు. యోగాతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.


గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో..


జడ్పీ బాలుర పాఠశాలలో యోగా చేస్తున్న ప్రజలు

కొమరోలు: రోజూ యోగా చేస్తే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ఎస్‌బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్‌చే విద్యార్థులతో యోగాసనాలు వేపించారు. కరస్పాండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ యోగా రోజూ సమయపాలన పాటిస్తూ చేయడం వలన మనసుకు, మెదడుకు ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. యోగా చేస్తే విద్యార్థులు ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బేస్తవారిపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఏకాగ్రతను పెంచుకోవచ్చునని, చదువుకున్న పాఠాలు ఎక్కువ కాలం గుర్తుకు పెట్టుకోవచ్చునని తెలిపారు. బేస్తవారిపేట జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్‌లలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆనందం

అర్ధవీడు (బేస్తవారిపేట): విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా చేయడంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. శారీరకంగా ఆరోగ్యవంతులుగా జీవించడానికి యోగా, ధ్యానం చిన్ననాటినుంచే ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని కోరారు. పీడీ ప్రకాష్, పీఈటీ పెద్దన్నలు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు యోగా ఆసనాలు వేశారు. మండల స్థాయి అధికారులు స్థానిక ఎంపీడీఓ కార్యాక్రమంలో యోగా డే కార్యక్రమం నిర్వహించి పలు ఆసనాలు వేసి యోగా చేస్తే కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఎంఈఓలు మాల్యాద్రి, శర్వాణి, ఉపాధి ఏపీఓ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మార్కాపురం : యోగా చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది


బేస్తవారిపేటలో యోగాసనాలు నేర్పిస్తున్న రిటైర్డ్ ఎంఈఓ మాధవకృష్ణారావు


మార్కాపురంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


గొట్లగట్టు కస్తూర్బా పాఠశాలలో..


యోగా ఆసనాలు వేస్తున్న కంభం అధికారులు

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కంభం ఎంపీడీఓ మస్తాన్ వలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పార్వతి


కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొనకనమిట్ల: బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ, ఎంఈఓలు డాంగేషరీఫ్, నరసింహరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వంటవాళ్లను ఇబ్బంది పెట్టొద్దు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఏళ్లగా మధ్యాహ్న భోజన వండి పెడుతున్న కార్మికులు, స్వీపర్లను మానుకోవాలని ఆదేశాలివ్వడం మానుకోవాలని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు స్పష్టం చేశారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు చేసి గ్రామాల్లో కక్షలు పెంచే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో తాము ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు చేయలేదని గుర్తు చేశారు. పాఠశాలల్లో ఏదైనా సమస్య వస్తే పాఠశాల కమిటీ, గ్రామ సర్పంచ్ ఉంటారని వారు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అలా కాకుండా కక్షపూరిత రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు.

బేస్తవారిపేట: గ్రామాల్లో బడిబయటి పిల్లలను గుర్తించాలని ఎంపీడీఓ టి.పార్వతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో నేను బడికి పోతా కార్యక్రమంపై హెచ్ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలకు వెళ్లని విద్యార్థులను బడిలో చేర్పించాలని సూచించారు. వయసుకు తగిన తరగతిలో చేర్పించాలని, ఆ తరగతి స్థాయి అందుకునేందుకు ఉపాధ్యాయులు బ్రిడ్జ్ కోర్సును ఉపయోగించాలని కోరారు. ఏ గ్రామంలో కూడా బడిబయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డి, ఏపీఓ రఘునాధబాబు, డీటీ, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత అందరి బాధ్యత

కంభం: సంపూర్ణ అక్షరాస్యత మనందరి బాధ్యతని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఇంటింటి సర్వే ద్వారా బడి బయటి పిల్లలను గుర్తించాలని తెలిపారు. 6-18 సంవత్సరాల విద్యార్థులు తప్పనిసరిగా బడిబాట పట్టేలా చూడాలని డ్రాపౌట్స్, నెవర్ ఎన్రోల్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు మాల్యాద్రి, శర్వాణి మాట్లాడుతూ బడి మధ్యలో మానేసిన విద్యార్థులు, అసలు బడికి రాని విద్యార్థులను వేర్వేరుగా గుర్తించి అందరిని బడిలో చేర్పించేలా చూడాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వార్డెన్లు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు ఔట్!

- హుకుం జారీ చేసిన నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేత
- ఆ మేరకు హెచ్ఎంలకు ఆదేశాలిచ్చిన ఎంఈఓ
- ఏ కారణం చెప్పి తొలగించాలని తలపట్టుకుంటున్న హెచ్ఎంలు
- పొట్ట కొట్టొద్దని వేడుకుంటున్న కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, స్వీపర్లు

కొనకనమిట్ల: 'మీరేం చేస్తారో మాకు తెలీదు. వెంటనే పాఠశాలల్లో కుకింగ్ ఏజెన్సీలతోపాటు స్వీపర్లను మానుకోమని చెప్పండి'ఇవీ కొనకనమిట్ల మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓ నుంచి వచ్చిన ఆదేశాలు. రెండు రోజుల క్రితం కొనకనమిట్ల ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలతో ఎంఈఓ డాంగే షరీఫ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాధారణ విధులపై సూచనలిచ్చిన తర్వాత అధికార టీడీపీ నేతల ఆకాంక్షను ఆదేశాల రూపంలో వెల్లడించారు. అయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎలా మానుకోమని చెప్పగలమని పలువురు హెచ్ఎంలు ప్రస్తావించడంతో ఎలాగైనా మాన్పించాలని ఎంఈఓ తేల్చిచెప్పారు. దీంతో తలపట్టుకోవడం హెచ్ఎంల వంతయింది.

పొట్ట కొట్టొద్దయ్యా..

కొనకనమిట్ల మండలంలో మొత్తం 80 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో జెడ్పీ ఉన్నత పాఠశాలలు 8, యూపీ పాఠశాలలు 7, ఎలిమెంటరీ పాఠశాలలు 63 ఉన్నాయి. సుమారు 110 మంది కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులుగా, 88 మంది స్వీపర్లుగా పనిచేస్తున్నారు. నియోజకవర్గ అధికార పార్టీ నేత హుకుం జారీ చేయడంతో వీరి పొట్ట కొట్టేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుత పరిణామాలను ఆ నోటా ఈ నోటా విని తెలుసుకున్న కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి నుంచి పనిచేస్తున్న తమను అన్యాయంగా తొలగించవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందరూ బడుగులే..

గ్రామాల్లో ఎప్పటి నుంచో బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారు పాఠశాలల్లో కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులుగా, స్వీపర్లుగా పని చేస్తున్నారు. వీరందరినీ వంట సరిగా చేయడం లేదని, గుడ్లు అందజేయడం లేదని రికార్డుల్లో రాసి ఇంటికి సాగనంపాలని టీడీపీ నాయకులు పథకం రచించారు. ఆ మేరకు ఎంఈఓపై ఒత్తిడి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై 20 రోజులు కాకముందే టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

నేటి నుంచి పెన్షన్ల వెరిఫికేషన్

కంభం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి సోషల్ ఆడిట్ చేయనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మధ్యాహ్నం సోషల్ ఆడిట్ బృందం సభ్యులు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పొందుతున్న అన్ని రకాల పెన్షన్లకు సంబంధించి వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించనున్నామని, లబ్ధిదారులు అందుబాటులో ఉండి రేషను కార్డు, ఆధార్ కార్డులు చూపించాలని వికలాంగ పెన్షన్లు పొందే వారు వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇతర గ్రామాల్లో ఉంటే వారు వారి గ్రామాల్లో జరిగే వెరిఫికేషన్ కార్యక్రమంలో హాజరవ్వాలని సూచించారు.

రేపటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ టి.పెద్ద వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొండలరావు శుక్రవారం తెలిపారు. 24న ఉదయం ధ్వజారోహణం అనంతరం శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు, 25న హనుమంత వాహన సేవ, అనంతరం భూనీలా సమేత వెంకటేశ్వర స్వామివారి కల్యాణం, ప్రసాద వితరణ, అదేరోజు రాత్రి 7 గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు. 26న అశ్వవాహన సేవ, 27న ఊంజల్ సేవ, ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి


కొనకనమిట్లలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కొనకనమిట్లలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతు సంఘం నాయకులు పిల్లి కొండయ్య పర్యవేక్షణలో ఏరువాక పౌర్ణమి రైతు మహోత్సవాలు నిర్వహించారు. రైతులకు సంబంధించిన ట్రాక్టర్లను పూజించి పొలాల్లో ఏరువాక కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రైతులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాక్టర్ల కొనుగోలుపై 50 శాతం రాయితీ కల్పించాలని, ఎకరాకు సాగు సాయం కింద రూ.15 వేలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాలు 90 శాతం రాయితీ కల్పించాలన్నారు. కృష్ణా నది జలాల సమస్యలను పరిష్కరించి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీవీ కొండయ్య, శిగినం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పెద్దసిద్దయ్య, మీరయ్య, నారాయణరెడ్డి, వెలుగొండయ్య, చెన్నారెడ్డి, కాశిరెడ్డి, ఏసేబు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం విద్యార్థి నమోదు జరిగేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో «నేను బడికి పోతా» కార్యక్రమంపై పట్టణ, మండల స్థాయి హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రాపౌట్స్ లేకుండా బడి బయట పిల్లలను బడిలో చేర్చే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తగిన ప్రణాళికతో పనిచేయాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారి కోసం సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల నుంచి త్వరితగతిన ఆధార్ ప్రాసెస్ చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ఇంటర్ విద్యార్థుల వరకు ఉంటుందని, డ్రాపౌట్స్ అయినప్పటికీ గ్రామస్థాయి బృందం విద్యార్థులను పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలని తెలిపారు. నాణ్యమైన విద్య అందిస్తే బాల్యవివాహాలను అడ్డుకోవచ్చని ఎంపీడీఓ చందన తెలిపారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓలు రాందాస్‌నాయక్, శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఏఎస్‌డబ్ల్యుఓ అరుణ, బీసీడబ్ల్యుఓ జబ్బార్, హెచ్ఎంలు పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంలో బీసీ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, హెచ్ఎం శ్రీదేవి వినతిపత్రం అందజేశారు.

వెంకటేశ్వర స్వామికి అష్టోత్తర శత కలశ స్నపనం


కలశాలతో శోభాయాత్ర

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. స్వామివారి ప్రతిష్ఠ రోజును పురస్కరించుకుని ఆలయంలో తొలిసారిగా అష్టోత్తర శత కలశ స్నపన పూజ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా సాగింది. వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి 108 మంది దంపతులు కలశాలతో మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రగా వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థాన ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, దేవస్థాన ప్రధాన సలహాదారులు నారాయణం మురళీకృష్ణమాచార్యులు అభిషేక కార్యక్రమాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, మేడా నరసింహారావు, వెలిశెట్టి నారాయణ, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, సామి రాజా తదితరులు పాల్గొన్నారు.


కలశ పూజలో పాల్గొన్న మహిళలు